అధ్వానంగా బైరాగిగూడ- లేమూరు రోడ్డు

గుంతల మయంగా మారిన రోడ్డు

కందుకూరు, డిసెంబర్ 8 : బైరాగిగూడ నుంచి లేమూరు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. దాదాపుగా రెండు కిలో మీటర్ల వరకు గుంతల మయంగా మారడంతో నిత్యం ప్రజలు అవస్థలు పడుతున్నారు. అసలే ఇరుకైనా రోడ్డు పైగా అధ్వానంగా తయారు కావడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. రోడ్డు విషయంలో ఎవరు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణతో పాటు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. లేమూరు గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం బైరాగిగూడ కావడంతో లేమూరు గ్రామానికి వెళ్లాల్సివస్తుందని అంటున్నారు. లేమూరు గ్రామానికి వాహనాలపై వెళ్తున్నప్పుడు కానీ నడకదారిన వెళ్తున్నప్పుడు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పోవాల్సి వస్తుందని పలువురు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో మరమ్మతుల కోసం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నిధులను మంజూరు చేసిందని బీఆర్ఎస్ ప్రభుత్వం రాకపోవడంతో నిధులు నిలిచిపోయాయని తెలిపారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే నిధులను మంజూరు చేసి బీటీ రోడ్డును నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి

బైరాగిగూడ, లేమూరు రోడ్డు మరమ్మతులు చేపట్టాలి. రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. రోడ్డు వెంట వెళ్లడానికి ప్రజలు జంకుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. రోడ్డు నిర్మాణం సమయంలో కాంట్రాక్టర్ నాసిరకంగా చేపట్టారు. తాము తరచుగా లేమూరు గ్రామానికి వెలుతుంటాం. ఆ సమయంలో రోడ్డు చిన్నగా ఉండటం, అధ్వానంగా రోడ్డు తయారు కావడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి

–ఎండీ దావూద్, బైరాగిగూడ

నూతన కార్యవర్గం

బండ్లగూడ : ముదిరాజ్ కులస్తుల అభివృద్ధికి అందరి సహకారం ముఖ్యమని అధ్యక్షుడు నీరుడు శ్రీరాములు ముదిరాజ్ అన్నారు. ఆదివారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో ముద్ర సేవా సంఘం ఆధ్వర్యంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు శ్రీరాములు ముదిరాజ్ మాట్లాడుతూ.. కిస్మత్‌పూర్‌లోని ముదిరాజ్ సంఘం సభ్యులు సంఘ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అసోసియేటెడ్ అధ్యక్షుడిగా నారాయణ ముదిరాజ్‌ను ఎన్నుకున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, డిసెంబర్ 8 : కొత్తపేటలో గౌడ సంఘం, ఆలయ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ సురమాంబ సమేత శ్రీ కంఠ మహేశ్వర స్వామి, శ్రీ గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, నంది వాహనం, బలిపీఠం, శ్రీ వన మైసమ్మ దేవి, శ్రీ రేణుకాఎల్లమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన నూతన శిఖర స్థాపన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేశారు. బ్రహ్మశ్రీ రావిరాల పరమేశ్వర శాస్త్రీ ఆధ్వర్యంలో ఆలయంలో పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్, తెలంగాణ రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి , ఎల్బీనగర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ లింగాల నాగేశ్వర్‌రావు, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాశ్‌గౌడ్‌తో పాటుగా కొత్తపేట గౌడ సంఘం , ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పూజలో పాల్గొన్న గౌడ సంఘం నాయకులు

శ్రీవెంకటగిరి కాలనీ నూతన కమిటీ

సైదాబాద్, డిసెంబర్ 8 : ఎస్బీహెచ్ స్టాఫ్ హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీవెంకటగిరి కాలనీ (గడ్డిఅన్నారం) వెంచర్–1 నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా పాపిరెడ్డి, మురళీధర్, సెక్రటరీగా రమేశ్, జాయింట్ సెక్రటరీగా ఆనంద్, జగన్నాథం, అసిస్టెంట్ సెక్రటరీగా శ్రీనివాస్, ట్రెజరర్‌గా పీఎం దాదా హయత్‌ఖాన్, సభ్యులుగా శ్రీధర్, ఆనంద్, జానకి, సుధీర్, మధుకర్, రాజేంద్ర ప్రసాద్, బాల మురళీ కృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అంధకారంలో కాలనీలు

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 8 : హౌసింగ్‌బోర్డు కాలనీ లక్ష్మీగూడలోని చౌరస్తాలో హైమాస్ట్ లైట్లు, వీధి దీపాలు వెలుగడం లేదు. సాయంత్రమైతే మహిళలు, చిన్నారులు వెళ్లలేని పరిస్థితి నెలకొంటున్నది. రాత్రి వాహనాదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి మరమ్మతులు, కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వైభవంగా అయ్యప్ప పడి పూజ

అయ్యప్ప స్వాములతో మాజీ మంత్రి,ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, డిసెంబర్8: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ ఎస్పీ ఆర్ గార్డెన్‌లో అయ్యప్ప గురుస్వామి కళ్లెం ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప కృప వలన నియోజక వర్గం ప్రజలు సుభిక్షంగా ఉండే విధంగా చూడాలని స్వామివారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వంగేటి ప్రభాకర్ రెడ్డి, చిగిరింత పెద్ద నర్సింహారెడ్డి, గుండోజ్ రఘునందన్ చారి, శ్రీనివాస్ రెడ్డి, రామిడి రాంరెడ్డి, ఏనుగు రాంరెడ్డి, సంరెడ్డి వెంకట్ రెడ్డి, సిద్ధాల బీరప్ప, గిరీశ్, వెంకట్ రెడ్డి, బొర్ర మాదవ రెడ్డి తదితరులు ఉన్నారు.

మంచు దుప్పటిలో కీసర ఆలయం

అసలే చలికాలం ఆపై మంచు కురుస్తుండడంతో జిల్లాలో ప్రసిద్ధ ఆలయమైన కీసర గుట్ట భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయంపై ఆదివారం ఇలా మంచు దుప్పటి పరిచినట్లుగా కనిపించింది. సెలవుదినం కావడంతో భక్తులు భారీగా వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

విద్యాధర చారికి కామధేను జాతీయ పురస్కారం

ప్రముఖ సూక్ష్మ కళాకారుడు డాక్టర్ ముంజంపల్లి విద్యాధర చారికి మరో పురస్కారం లభించింది. విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ అందించే కామధేను జాతీయ పురస్కారం 2024కు ఎంపికయ్యారు. ఆదివారం నగర్‌లోని బేగంపేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా, సంస్థ సీఈవో సత్యవోలు రాంబాబు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. గతంలో అనితర సాధ్యమైన, అద్భుతమైన సూక్ష్మ కళాకండాలను ఆయన రూపొందించారు. ఆవగింజపై వినాయకుడి చిత్రం, తల వెంట్రుకపై మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చిత్రం, బియ్యపు గింజపై 133 అక్షరాల జాతీయ గీతాన్ని లిఖించి రికార్డు సృష్టించారు. ఇప్పటికే లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడంతోపాటు, ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. తనను కామధేను పురస్కారానికి ఎంపిక చేసిన జ్యూరీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి పురస్కారం తన బాధ్యతను పెంచుతుందన్నారు. –వనస్థలిపురం, డిసెంబర్ 8

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

కందుకూరు, డిసెంబర్ 8 : 20 సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థులు ఒకే చోట కలుసుకున్నారు. మండల పరిధిలోని ఆకులమైలారంలో గల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005 వ సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులందరూ ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. గుమ్మడవెల్లి, గుమ్మడవెల్లి తండా, మాలాగూడ, ఆకులమైలారం గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. తీపి జ్ఞాకాలను గుర్తు చేసుకున్నారు. ఒకే చోట సహపంక్తి భోజనాలు చేశారు.

అయ్యప్ప పడిపూజ

అంబర్‌పేట, డిసెంబర్ 8 : అంబర్‌పేట డివిజన్ ప్రేంనగర్ వంజర సంఘం ప్రధాన కార్యదర్శి గంరాజు ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా జరిగింది. ఈ పూజలో సంఘం కోశాధికారి వారే బాలకృష్ణ, కాలేరు రాజు, వెంకులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం స్వాములకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దీపక్‌కుమార్‌కు గ్లోబల్ పీస్ అవార్డు

గోల్నాక, డిసెంబర్ 8: అంబర్ పేటకు చెందిన నేతకాని మహార్ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి బోర్లకుంట దీపక్‌కుమార్‌కు గ్లోబల్ పీస్ అవార్డు దక్కింది. ఆదివారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో బహుజన విద్యార్థి పరిషత్ ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన అసిస్టెంట్ మినిస్టర్ ఆఫ్ ఫారెన్ ఎఫైర్స్ ప్రొఫెసర్ డాక్టర్ మధుకిరణ్, మాజీ డీజీపీ జయచంద్ర తదితరులు బడుగు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తున్న దీపక్‌కుమార్‌కు గ్లోబల్ పీస్ అవార్డును ప్రదానం చేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

అంబర్‌పేట, డిసెంబర్ 8: నల్లకుంట డివిజన్‌లోని టీఆర్టీ కాలనీలో శ్రీ దుర్గామాత దేవాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన ఆదివారం ఉదయం జరిగింది. ముఖ్య అతిథిగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ హాజరై పూజలు చేశారు. ఎమ్మెల్యేతో పాటు నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత, బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీదుర్గామాత దేవాలయ కమిటీ అధ్యక్షుడు నల్లా నరేశ్‌కుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, మురళి, స్వప్న, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత ఆలయ పునర్నిర్మాణ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

పుస్తకావిష్కరణ

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 8 : ప్రముఖ రచయిత డాక్టర్ ప్రయాగ మురళీ మోహనకృష్ణ యూరప్ దేశంలో 40ఏండ్ల స్వానుభవాలు, సంఘటనలను వివరిస్తూ విదేశాలల్లో స్థిరపడాలనే యువతకు మార్గనిర్దేశం చేసేలా ఒక మంచి గ్రంథం రచించి అందించారని వక్తలు ప్రశంసించారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆదివారం ప్రముఖ రచయిత డాక్టర్ ప్రయాగ మురళీమోహనకృష్ణ రచించిన 'టాప్ హ్యాట్స్ అండ్ టెయిల్ కోట్స్' అనే గ్రంథావిష్కరణ జరిగింది. మాజీ ఎంపీ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ప్రసంగిస్తూ విదేశీ వ్యామోహంలో ఉన్న యువతకు ఆలోచనరేకిత్తేంచేలా ఈ గ్రంథం ఉందన్నారు. విదేశాలకు వెళ్లిన పొరుగు దేశాల ప్రజలు పడే ఇక్కట్లను కళ్లకు కట్టినట్లుగా తెలియజేశారని అన్నారు. ప్రముఖ రచయితలు ఓలేటి పార్వతీశం, డాక్టర్ శేషగిరిరావు, భాస్కర్ గడేపల్లి, మెట్ట రామారావు, రచయిత్రులు అత్తలూరి విజయలక్ష్మి, డాక్టర్ ప్రయాగ రాజ్యలక్ష్మి, గాడేపల్లి శశికళ పాల్గొని రచయిత మోహన కృష్ణ సాహిత్య శైలిని వివరించారు.

శారదానగర్ సమస్యల పరిష్కారానికి కృషి

శారదానగర్ కాలనీ అసోసియేషన్ వాసులతో సమావేశమైన కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి

అంబర్‌పేట, డిసెంబర్ 8 : శారదానగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి అన్నారు. ఆదివారం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులతో ఆమె సమావేశమై కాలనీలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్‌ను కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదవరెడ్డి, కార్యదర్శి శేఖర్య, సభ్యులు సన్మానించారు.

బస్సు నుంచి జారిపడి మహిళ మృతి

కాచిగూడ,డిసెంబర్ 8: బస్సు నుంచి జారిపడి దవాఖానలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది.అడ్మిన్ ఎస్సై డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. బర్కత్‌పురలోని రాజేంద్రనగర్‌కాలనీకి చెందిన కనకమహాలక్ష్మి(55)మూడు నెలల క్రితం ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడటంతో తలకు తీవ్రంగా గాయమైంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు నెల రోజుల క్రితం పోలీసులు కనకమహాలక్ష్మిని చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్సై తెలిపారు.

నల్లకుంటలో జోరుగా అక్రమ నిర్మాణాలు

- అతి తక్కువ స్థలంలో కమర్షియల్ భవనాలు
- పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు

న్యూరామాలయం ప్రాంతంలో నిబంధనలకు విర్ధుంగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్లు

అంబర్‌పేట, డిసెంబర్ 8: నల్లకుంట డివిజన్‌లోని న్యూ రామాలయం పరిసర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఈ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. న్యూరామాలయం పోస్టాఫీసు గల్లీ, శ్రీరామ ఎడ్యుకేషనల్ సొసైటీ పక్క గల్లీ, రామాలయం పరిసర ప్రాంతాల్లో కొంతమంది భవన యజమానులు, బిల్డర్లు 150–200 చదరపు గజాల లోపు స్థలంలో ఏకంగా బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారు. జీహెచ్ఎంసీ నుంచి జీ ప్లస్ వన్ లేదా టూ అనుమతి తీసుకొని నాలుగైదు అదనపు అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. అదే విధంగా ఏ మాత్రం సెట్ బ్యాక్ లేకుండా తక్కువ స్థలంలో కమర్షియల్ భవనాల నిర్మాణాలు చేపడుతూ పార్కింగ్ స్థలాల్లో సైతం గదులను, అలాగే పై భాగంలో పెంట్ హౌజ్ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ, సెక్షన్ ఆఫీసర్‌కు ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా ఒక్కోసారి టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణదారులకు కనీసం నోటీసులు ఇవ్వడానికి సైతం జంకుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అక్రమ నిర్మాణాలపై భారీగా ఫిర్యాదులు అందితే అక్కడకు వచ్చి సదరు యజమానులకు నోటీసు ఇచ్చి వెళ్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

29న బ్రాహ్మణ మహా సమ్మేళనం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ అధ్యక్షుడు సుశీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్

అంబర్‌పేట,డిసెంబర్ 8: బ్రాహ్మణుల ఐక్యత, అభివృద్ధి, పూర్వవైభవం కోసం రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ మహా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుశీల్ కుమార్, ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ తెలిపారు. ఆదివారం బాగ్ అంబర్‌పేట సీఈ కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ..బ్రాహ్మణులు అన్ని రంగాల్లో వెనుకబడ్డారని, వారి అభివృద్ధి, పూర్వవైభవనం కోసం ఈనెల 29వ తేదీన రవీంద్రభారతిలో రాష్ట్రస్థాయి మహా సమ్మేళనం నిర్వహిస్తున్నామని, దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ హాజరవుతారని చెప్పారు. దూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ, తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, ఆహ్వాన కమిటీ కన్వీనర్ వి.పవి. రాంచందర్‌రావు, విష్ణు, శ్రీకాంత్, అసోసియేషన్ ప్రతినిధులు సీతారామయ్య, వైద్యనాథ్, వేదాంతం పవన్‌కుమార్, ప్రొ. మధుసూదన్‌రావు, విద్యావతి, వాణీరమణి, డాక్టర్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న మాదిగ సంక్షేమ సంఘం ప్రతినిధులు

అంబేద్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాల ప్రతిష్ఠ పనులు ప్రారంభం

చర్లపల్లి, డిసెంబర్ 8: చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలో ఆదివారం చర్లపల్లి మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాల ప్రతిష్ఠ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం నాయకులు జనార్దన్, యాదగిరి, నర్సింగ్‌రావు, గిరిబాబు, రమేశ్, కుమార్, నగేశ్, సురేశ్, పి.శ్రీనివాస్, భరత్‌రాజు, నందశోర్, గణేశ్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈసీఐఎల్‌లో పరుగుల పండుగ

కాప్రా, డిసెంబర్ 8: కాప్రాసర్కిల్ ఈసీఐఎల్ పారిశ్రామికవాడలో ఆదివారం ఉదయం మారథాన్ పరుగుల పండుగ 'ఈసీఐఎల్ రన్నర్స్– రన్ జాతర 2024' నిర్వహించారు. 5కి.మీ, 10 కి.మీ, 20.కి.మీ. విభాగాల్లో రన్నింగ్ పోటీలు నిర్వహించారు. జాతీయ క్రీడాకారులతో పాటు స్థానిక క్రీడాకారులు పెద్ద సంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఆదివారం వేకువజామున ఈసీఐఎల్ పారిశ్రామికవాడలో పరుగు పోటీల్లో పాల్గొనే క్రీడాకారులతో సందడి నెలకొంది. పరుగు పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరికీ టీషర్ట్‌లు, విజేతలకు మెడల్స్ అందజేశారు. ఈసీఐఎల్ ఆఫీసర్స్ అసోసియేషన్ భవనం నుంచి పోటీలు ప్రారంభమయ్యాయి. వందలాదిమంది క్రీడాకారులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు కేటాయించాలి

కాచిగూడ,డిసెంబర్ 8:రాష్ట్రంలోని కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.వెయ్యి కోట్ల రూపాయలను కేటాయించాలని తెలంగాణ గౌడ సంఘం జాయింట్ సెక్రటరీ, జమాల్‌బస్తీ గౌడ సంఘం అధ్యక్షుడు భీమాగౌని కృష్ణా గౌడ్ అన్నారు. ఆదివారం జమాల్‌బస్తీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కల్లుగీత కార్మిక సొసైటీలకు తాటి, ఈత వనాల పెంపు కోసం 20 ఎకరాల భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సిరిచందనరెడ్డి

అంబర్‌పేట, డిసెంబర్ 8: ప్రతిఒక్కరూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్య రక్షణకు కృషి చేయాలని సాయిదత్త హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. ధనుంజయ అన్నారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట, మల్లికార్జుననగర్‌లో డాక్టర్ సిరిచందనరెడ్డి జనరల్ ఫిజీషియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ ధనుంజయ ప్రారంభించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ ఇన్‌చార్జి డాక్టర్ కుమార్, డాక్టర్ కరిష్మా, డాక్టర్ ఫెర్నాడేజ్, కో–ఆర్డినేటర్, ప్రముఖ సంఘ సేవకులు బోనం వీరబాబు పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలి

కాచిగూడ,డిసెంబర్ 8: దేశ వ్యాప్తంగా కులగణన జరిగినప్పుడే బీసీల సమస్యలు పరిష్కారం అవుతాయని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ అన్నారు. ఆదివారం నింబోలిఅడ్డాలో విలేకరులతో మాట్లాడుతూ.. బీసీ కులాలవారీగా జనాభా లెక్కలు తెలిస్తే.. బీసీ రిజర్వేషన్ల అమలు, సంక్షేమ పథకాలు, నిధుల కేటాయింపులకు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా బీసీల సమగ్రాభివృద్ధికి లక్ష కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

అంబర్‌పేట, డిసెంబర్ 8 : అంబర్‌పేట డివిజన్ న్యూఅన్నపూర్ణనగర్ వాసులు ఆదివారం కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. కాలనీలో నెలకొన్న సమస్యలు వీధి దీపాలు వెలగడం లేదని, డ్రైనేజీ సమస్య ఉందని చెప్పారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ వీధి దీపాల నిర్వహణ అధికారులతో మాట్లాడి వెలగని వీధి దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని చెప్పారు. త్వరలోనే నూతన డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.